క్లుప్తంగా

ప్రధానార్చకుడిపై ఫిర్యాదు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులపై దేవస్థానంలో పురోహిత్ అలంకారిగా పనిచేస్తున్న కరి సీతారామాచార్యులు ఈవోకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 13న నిత్యకల్యాణం సేవలో ఉండగా తనను శ్రీ నివాసాచార్యులు ఇబ్బందికి గురిచేశారని, గతంలో కూడా తన విధులకు అడ్డుపడుతూ మానసికంగా, విధుల పరంగా ఇబ్బందికి గురిచేశారని సీతారామాచార్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్‌ను వివరణ కోరగా ఈనెల 13న గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యుల మధ్య చోటచేసుకున్న సంఘటన తన దృష్టికి వచ్చిందన్నారు. ఈవో సమక్షంలో ఇరువుని కూర్చోబెట్టి మాట్లాడతానని చెప్పారు.

నేషనల్ డిఫెన్స్ కాలేజీ బృందం సందర్శన



అవార్డు గ్యాలరీలో స్టీల్‌ప్లాంట్ అధికారులతో ఎన్‌డీసీ బృందం

ఉక్కునగరం: నేషనల్ డిఫెన్స్ కాలేజీ(ఎన్‌డీసీ) బృందం మంగళవారం స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించింది. పర్యటనలో భాగంగా బృందంలోని 17 మంది సభ్యులు ఉదయం ప్లాంట్‌కు చేరుకున్నారు. స్టీల్‌ప్లాంట్ ఈడీ(వర్క్స్) బిల్డింగ్‌లోని మోడల్ రూమ్‌ను సందర్శించారు. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి ప్రక్రియ, ముడి పదార్థాల సరఫరా, ఉత్పత్తుల రవాణా గురించి పీపీఏ విభాగం జీఎం డాక్టర్ రమాదేవి వారికి వివరించారు. అనంతరం అవార్డు గ్యాలరీని సందర్శించారు. స్టీల్‌ప్లాంట్ సాధించిన అవార్డులను పరిశీలించారు. తర్వాత టెక్నికల్ ట్రైనింగ్ సెంటర్ (టీటీసీ)కు వెళ్లి.. శిక్షణ కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు, వర్క్స్ అడ్మినిస్ట్రేషన్ అధికారి గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో కార్మికులకు అన్యాయం


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: తెలుగు వారి ఆత్మ గౌరవానికి ప్రతీక అయిన విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 761వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన ఎఫ్ఎండీ, ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్, సీఎంఈ, ప్లాంట్ డిజైన్, వీఎస్‌జీహెచ్ తదితర విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఉద్యమంలో పాల్గొన్న కార్మికులను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఒక తాటి పైకి వచ్చి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తే విశాఖ ఉక్కుకు సానుకూల స్పందన లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ పాలనలో దేశ ప్రజలు దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల కంపెనీలు మూతపడ్డాయని, కార్మికులు పనిలేక రోడ్డున పడ్డారని అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణలో తగ్గేదే లేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు

శ్రీగోవత్స రామాయణం పుస్తకావిష్కరణ

ఎంవీపీ కాలనీ: శ్రీగోవత్స రామాయణం గేయ పద్యరూప పుస్తకాన్ని రచయిత్రి మంథా సత్యప్రభ మంగళవారం ఆవిష్కరించారు. ఎంవీపీ కాలనీ సెక్టార్-11లోని కార్యాలయంలో ఈ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామాయణం అనేక మంది కవులు రచించిన సుమధుర కావ్యమన్నారు. సమాజాన్ని సన్మార్గంలో నడిపించే గొప్ప కావ్యంగా ఇది నిలిచిందన్నారు. అనేక రూపాల్లో అందుబాటులో ఉన్న రామాయణాన్ని శ్రీగోవత్స రామాయణంగా గేయ పద్య రూపంలో తాను రచించినట్లు ఆమె తెలిపారు. ఈ పద్యాలు పిల్లలు, పెద్దల్లో విజ్ఞానాన్ని, మంచి నడవడికను పెంచేలా ఉంటాయన్నారు. ఈ పుస్తకం ఆన్‌లైన్‌లో వినియోగదారులకు అందుబాటులో ఉందన్నారు. హిందీ భాషతో పాటు ఆడియో, వీడియో రూపంలో కూడా త్వరలో అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు.


పీతల బ్రదర్స్ ఏర్పాటు చేసిన స్టేజిపై దశవతారాల ప్రదర్శన


రామావతారం ప్రదర్శనలో..


కృష్ణావతారంలో..

గ్రామ దేవతల పండగ సందడి

పల్లెల్లో సందడి కొనసాగుతోంది. గ్రామ దేవతల వార్షిక పండగలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను కూడా పోటాపోటీగా ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం పరవాడ మండలంతో పాటు సింహాచలంలో గ్రామ దేవతల పండగలను ఘనంగా నిర్వహించారు.

- అట్టహాసంగా సాంస్కృతిక కార్యక్రమాలు
- భక్తిశ్రద్ధలతో అనుపు మహోత్సవాలు

సింహాచలం: జీవీఎంసీ 98వవార్డు పరిధి అప్పన్నపాలెంలో పోలిపిల్లమ్మ అమ్మవారి వార్షిక జాతర మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారికి మహిళలు పసుపుకుంకుమలు, చీరలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. గ్రామంలో అమ్మవారి ఘటాలను మేళతాళాల మధ్య ఊరేగించారు. అనుపులో ఏర్పాటు చేసిన బాణసంచా, తప్పెటగుళ్లు, గరగల డాన్స్ ఆకట్టుకున్నాయి. అలాగే సాయంత్రం పలు వేదికలపై నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆహుతులను ఉర్రూతలూగించాయి.భక్తులకు స్థానిక పోలమాంబ యూత్ ప్రసాద వితరణ చేసింది. వైఎస్సార్ సీపీ నాయకుడు పీతల అప్పలరాజు బ్రదర్స్ , సారిపిల్లి చిన్నారావు అండ్ బృందం, అప్పన్నపాలెం ఎంప్లాయీస్ యూనియన్ ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు పీతల విష్ణుమూర్తి, సెక్రటరీ ఈశ్వరరావు, ట్రెజరర్ దేముడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా సత్తెమ్మ వార్షిక జాతర

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామ పొలిమేర దేవత సత్తెమ్మ తల్లి వార్షిక జాతర మంగళవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజామున అమ్మవారికి సుప్రభాతసేవ, ఆరాధనను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తదుపరి భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు పి.వెంకటరావు ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి దంపతులు, 98వవార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.


పరదేశిమాంబను దర్శించుకుంటున్న సర్పంచ్ పూజాశేఖర్, భక్తులు

పరదేశమ్మా.. చల్లగ చూడమ్మా

పరవాడ: భర్నికం గ్రామ ప్రజల ఇలవేల్పు, భక్తుల పాలిట కొంగు బంగారమైన పరదేశిమాంబ జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు వేకువ జామునే తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ప్రసాదం, తాగునీరు, మజ్జిగ వంటి పానీయాలు పంపిణీ చేశారు. డప్పు వాయిద్యాలు, చిడతలు, భజనలు, నేల డ్యాన్సుల మధ్య అమ్మవారిని మంగళవారం రాత్రి పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం భారీ బాణ సంచాకాల్పుల నడుమ అనుపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పండగ సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీల విజేతలకు సర్పంచ్ పూజా శేఖర్ బహుమతులు అందజేశారు. సర్పంచ్ పెదిశెట్టి పూజాశేఖర్, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ తదితరులు పరదేశిమాంబను దర్శించుకున్నారు.


పరవాడ పైడిమాంబను దర్శించుకోవడానికి బారులు తీరిన భక్తులు


సత్తెమ్మతల్లి సన్నిధిలో మేయర్ హరి వెంకటకుమారికి అప్పన్న జ్ఞాపిక అందజేస్తున్న శ్రీనుబాబు


పోలిపిల్లమ్మను దర్శించుకుంటున్న ఆలయ కమిటీ సభ్యులు

ఘనంగా మారు వారం పండగలు

ముత్యాలమ్మపాలెం ముత్యమాంబ, పరవాడ పైడిమాంబ గ్రామ దేవతల మారువారం పండగలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువ జాము నుంచి అమ్మవార్లను దర్శించుకున్నారు. నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మిసీతారామయ్య దంపతులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ముత్యమాంబను దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు పైడిమాంబను దర్శించుకొని మొక్కులు తీర్చుకొన్నారు.

కల్యాణం.. కమనీయం


కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులను అధిష్ఠంపజేసి ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలు అందజేశారు.

సుబ్రహ్మణ్యుడికి విశేష పూజలు



సింహాచలం: విజిని గిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో కొలువైన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

ఈఎస్ఎఫ్ విభాగాధిపతిగా దుర్గాప్రసాద్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ (ఈఎస్ఎఫ్) విభాగాధిపతిగా విభాగం జీఎం ఎం.వి.ఎస్. దుర్గాప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. 1999లో సింటర్ ప్లాంట్ విభాగం నుంచి డిప్యూటీ మేనేజర్‌గా బదిలీపై వచ్చిన దుర్గాప్రసాద్ అంచెలంచెలుగా జనరల్ మేనేజర్ స్థాయికి ఎదిగారు. ఇప్పటి వరకు హెచ్‌వోడీగా ఉన్న పి.ఎస్. ఘోష్‌ను మెకానికల్ (జీఎం)గా నియమించడంతో ఆ స్థానంలో దుర్గాప్రసాద్ నియమితులయ్యారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- కేంద్రాల వద్ద 144 సెక్షన్

సబ్బవరం: ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ఎన్ఎస్‌వీ కేశవరావు మంగళవారం తెలిపారు. పరీక్షల నిర్వహణకు సబ్బవరంలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. సబ్బవరం గురుకుల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రెండు పరీక్షా కేంద్రాల్లో 1415 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్టు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కేంద్రాల్లో విద్యుత్ లైట్లు,తాగునీరు, సీసీ కెమెరాలు ,వైద్య శిబిరం వంటి అన్ని రకాల వసతులు కల్పించినట్లు ఈ సందర్భంగా తెలిపారు. బుధవారం నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకూ ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జంబ్లింగ్ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల పర్యవేక్షకుడిగా డి. కోటేశ్వరరావు వ్యవహరిస్తారని ప్రిన్సిపాల్ విజయ కుమార్ తెలిపారు.

పెందుర్తిలో..

సింహాచలం: పెందుర్తిలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు పలు కళాశాలల్లో ఏర్పాట్లు చేశారు. మొత్తం నాలుగు కళాశాలల్లో బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 625 మంది, పెందుర్తి బాలాజీ జూనియర్ కళాశాలలో 610 మంది, రాజయ్యపేట సమీపంలోని డీఆర్‌జే కళాశాలలో 474మంది, ఆర్ఆర్‌వెంకటరావురం వద్ద ఉన్న ఎస్‌వీఎల్ఎస్ కళాశాలలో 554మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఆయా కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేశారు.


పరీక్షా కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

నులిపురుగులతో ఎదుగుదల లోపం

సబ్బవరం: నులిపురుగులు ఉంటే పిల్లల్లో ఎదుగుదల లోపిస్తుందని ఎంపీడీవో రమేష్‌నాయుడు అన్నారు. సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంపీడీవో రమేష్ నాయుడు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎస్ఆర్ చక్రవర్తి నులిపురుగుల నివారణ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.ఎంపీడీవో రమేష్ నాయుడు మాట్లాడుతూ పిల్లల్లో ఉండే నులిపురుగుల సమస్యను ప్రజా ఆరోగ్య సమస్యగా గుర్తించడం జరిగిందన్నారు. అవి జీవ పేగుల్లో ఇన్‌ఫెక్షన్‌కు గురిచేసి పిల్లల ఎదుగుదలతో పాటు వారి ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని చెప్పారు. పిల్లల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపం వంటివి ఏర్పడతాయన్నారు. క్రమం తప్పకుండా నులిపురుగుల నివారణ మందులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎస్. అప్పలరాజు, పాఠశాల హెచ్ఎం సీహెచ్ చిన్నమ్మాయి, ఎంపీహెచ్‌వో కె. జేసుదాసు, ఏఎస్ఎం టి. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఆల్బెండజోల్ పంపిణీ

పరవాడ: మండలంలోని పరవాడ, వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పరవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ఐ.ఆర్.రంజిత్ స్థానిక పాఠశాల విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు మింగించారు. పీహెచ్‌సీ పరిధిలో 12 ప్రాథమిక పాఠశాలలు, 19 అంగన్‌వాడీ కేంద్రాలు, 25 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు చెందిన 6772 మంది విద్యార్థులకు డీ వార్మింగ్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కిశోర్‌కుమార్, సీహెచ్‌వో అప్పన్న, సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వాడచీపురుపల్లి పీహెచ్‌సీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 5257 మంది చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కనకఅప్పారావు, వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాల హెచ్ఎం కర్రి జగన్‌మోహన్‌నాయుడు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపీడీవో రమేష్ నాయుడు


విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న వైద్యాధికారి రంజిత్


వాడచీపురుపల్లిలో మాత్ర వేస్తున్న డాక్టర్ కనకఅప్పారావు

దండికోనేరు అభివృద్ధి పనులు ప్రారంభం


సబ్బవరంలోని దండి కోనేరును పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

సబ్బవరం: సబ్బవరంలోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయాన్ని ఆనుకుని ఉన్న దండి కోనేరు అభివృద్ధి పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పనులను పరిశీలించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో పనులు చేపడుతున్నారు. కోనేరును అభివృద్ధి చేసి పార్కుగా తీర్చిదిద్దనున్నట్లు పంచాయతీ పాలవర్గ సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. పార్కులో వాకింగ్ ట్రాక్,గార్డెన్, బెంచ్‌లు ఏర్పాటు చేసి ఆధునీకరించనున్నట్లు తెలిపారు. అవసరమైన నిధులు దాతల నుంచి విరాళాలు స్వీకరించి అభివృద్ధి చేపడతామని చెప్పారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అవసరమైన నిధులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ నాయుడు, సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఈవోఆర్‌డీ మహేష్, పంచాయతీ కార్యదర్శి కార్యమూర్తి, పాలకవర్గ సభ్యులు టి. శేఖర్, కొల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోబోటిక్స్‌లో ఏయూ స్కూల్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న శిరీన్ రెహమాన్

ఏయూక్యాంపస్: ఆంధ్రాయూనివర్సిటీ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు రోబోటిక్ పోటీల్లో ప్రతిభ చూపారు. ఇటీవల పుణేలోని శ్రీ శివ ఛత్రపతి శివాజీ స్టేడియంలో నిర్వహించిన ఎఫ్‌టీసీ రోబోటిక్స్ స్టెమ్ టెక్నాలజీ టోర్నమెంట్‌లో పాల్గొని ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో 60 జాతీయ, 11 అంతర్జాతీయ జట్లు పాల్గొన్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి పాల్గొన్న ఏయూ విద్యార్థుల బృందం పుణే, చెన్నై, గుజరాత్ వంటి ఇతర రాష్ట్రాల జట్లతో ఇజ్రాయిల్, రొమేనియా వంటి అంతర్జాతీయ జట్లతో పోటీ పడ్డారు. 71 జట్లలో ఏయూ జట్టు 28వ స్థానంలో నిలిచింది. ఏయూ జట్టుకు స్టెమ్ యంగ్ అచీవర్ అవార్డు లభించింది. ఏయూ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులకు రోబోటిక్స్ రంగంలో అవసరమైన శిక్షణ, నైపుణ్యాలను ఎన్ఆర్ఐలు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రహమాన్, శిరీన్ రహమాన్ దంపతుల కుమారుడు సమీర్ షేక్, సంతోష్ అందించారు. విద్యార్థుల ఆసక్తులు, సామర్థ్యాలకు అనుగుణంగా వారికి ఆన్‌లైన్‌లో శిక్షణ అందిస్తూ వారికి అవసరమైన వనరులు సమాకూర్చారు. ఈ ఘనత సాధించిన విద్యార్థులను చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ శిరీన్ రహమాన్ అభినందించారు.

విభిన్న ప్రతిభావంతులకు ముగిసిన శిక్షణ


సర్టిఫికెట్ అందజేస్తున్న జీఎం అశోక్

ఉక్కునగరం: విభిన్న ప్రతిభావంతులకు స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేసిన నైపుణ్య శిక్షణ ముగియడంతో, మంగళవారం వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. స్టీల్‌ప్లాంట్ కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ రెస్పాన్సిబిలిటీ (సీఈఆర్) కార్యక్రమంలో భాగంగా జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 100 మంది విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు. స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టైలరింగ్ తో పాటు అగరబత్తి, కొవ్వొత్తులు, ఫినాయిల్, సబ్బుల తయారీ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. టైలరింగ్ శిక్షణ మూడు నెలలు కాగా, మిగిలిన అంశాల్లో రెండు నెలలు శిక్షణ ఇచ్చారు. సుజాత నగర్‌లోని శ్రేయ ఫౌండేషన్, పెదవాల్తేరులోని సన్‌ఫ్లవర్ స్పెషల్ స్కూల్, ఎంవీపీ కాలనీలోని లెబెన్ హిల్ఫేల్లో ఈ శిక్షణ ఇచ్చారు. స్టీల్‌ప్లాంట్‌లోని టెక్నికల్ ట్రైనింగ్ సెంటర్‌లో మంగళవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో సీఎస్సార్ విభాగం జీఎం ఎ.అశోక్ ముఖ్య అతిథిగా హాజరై, శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సీఎస్సార్ అధికారులు పలువురు పాల్గొన్నారు.

గెడ్డలోకి దూసుకెళ్లిన కారు

పెదగంట్యాడ పీహెచ్‌సీ వైద్యాధికారికి గాయాలు

పెదగంట్యాడ: మండలంలోని వినాయనగర్ వుడా కాలనీ కమ్యూనిటీ హాల్ సమీపంలో మంగళవారం ఓ కారు అదుపుతప్పి గెడ్డలోకి దూసుకెళ్లింది. దీంతో కారులో ఉన్న పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబుకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయకనగర్ వుడా కాలనీలో గల సీడబ్ల్యూసీలో మంగళవారం నిర్వహించనున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వైద్యాధికారి రమేష్‌బాబు వచ్చారు. ఆ కార్యక్రమాన్ని ముగించుకుని తిరిగి వెళ్లేందుకు ఆయన గెడ్డ పక్కన పార్కింగ్ చేసిన కారును తీస్తుండగా ఒక్కసారిగా కారు ముందుకు వెళ్లిపోయింది. దానిని కంట్రోల్ చేసేలోగా గెడ్డలోకి దూసుకెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆయన స్వల్ప గాయాలతో బయట పడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే అతన్ని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. గెడ్డలో ఉన్న కారును జీవీఎంసీ అధికారులు జేసీబీ సాయంతో బయటకు తీశారు. ఈ ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని న్యూపోర్టు సీఐ రాము తెలిపారు.


గెడ్డలోకి దూసుకెళ్లిన కారు, పక్కన డాక్టర్ రమేష్‌బాబు

గంజాయి పట్టివేత

మద్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. పశ్చిమ బంగాకు చెందిన ఐదుగుర్ని అరెస్టు చేశారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఐటీఐ జంక్షన్ వద్ద కాపుగాసి గంజాయి తరలిస్తున్న నిందితులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఐదో పట్టణ సీఐ విజయ్‌కుమార్ సంయుక్తంగా అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 160 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

వచ్చే నెల నుంచి విద్యార్థులకు రాగిజావ

పెదగంట్యాడ: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా వచ్చే నెల ఒకటి నుంచి విద్యార్థులకు రాగిజావను అందజేయాలని ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ జిల్లా సమన్వయకర్త జయశాస్త్రి ఆదేశించారు. మండలంలోని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నెల్లిముక్కు ఎంపీపీ పాఠశాల, సిద్దేశ్వరంలోని ఎంపీపీ పాఠశాలలను యూనిట్ బృందం మంగళవారం సందర్శించింది. ఆయా పాఠశాలల్లో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని బృంద సభ్యులు పరిశీలించారు. విద్యార్థులకు భోజనాలు వడ్డించారు. నాణ్యతపై ఆరా తీశారు. రికార్డులను తనిఖీ చేశారు. పాఠశాలలకు అందజేస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పోషక విలువలున్న ఆహారాన్ని విద్యార్థులకు అందజేస్తున్నామని చెప్పారు. పాఠశాలలకు వచ్చే విద్యార్థుల్లో 90 శాతం మంది మధ్యాహ్న భోజనం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సహాయ సమన్వయకర్త సత్యనారాయణ, సీఆర్పీ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న బృంద సభ్యులు

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
7997958341, 9912440606
సాక్షి

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com